

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెగడపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు



ములుగులోని ఎస్పీ కాలనీలో విద్యుత్ స్తంభం కూలడంతో ధ్వంసమైన కారు

# అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు

**కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం • విద్యుత్ స్తంభం పడి కారు ధ్వంసం**

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్,మే 13 : ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షం రైతులకు నష్టాన్ని మిగిల్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని గ్రామాల్లో గాలివాన బీభత్సానికి వరి పంట నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం, కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసి ముద్దయింది. ములుగులో ధాన్యం రాసులపై కప్పిన టార్పాలిన్లు కొట్టుకుపోయాయి. ధాన్యం రాశులు, బస్తాలు తడిసిపోయాయి. ములుగులోని ఎస్పీ కాలనీలో కారుపై విద్యుత్ స్తంభం విరిగిపడడంతో దెబ్బతింది. కారులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. మంగపేట మండలంలోని పలు గ్రామాల్లో ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. వాజేడు మండలంలో మామిడి కాయలు నేలరాలిపోయాయి. వరంగల్ జిల్లా చెన్నారావుపేట కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. పది రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉంచినా ప్రభుత్వం కొనుగోలు చేయలేదని వాపోయారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెగడపల్లి, ముచ్చర్లలో వానకు వడ్లు కొట్టుకుపోయాయి.

**పిడుగుపడి 45 క్వింటాళ్ల మిరప దగ్ధం**

జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో ఆదివారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని పాగుంట గ్రామానికి చెందిన కురువ సిద్ధప్ప నాలుగెకరాల్లో మిర్చి పంట సాగు చేశాడు. దాదాపుగా 45 క్వింటాళ్ల మిరప పంటను పొలం వద్ద నిల్వ చేశాడు. కాగా, అర్ధరాత్రి నిల్వ చేసిన మిరప ఉత్పత్తులపై పిడుగు పడడంతో మొత్తం కాలి బుడిదైంది. దాదాపుగా రూ.9 లక్షల నష్టం జరిగినట్లు బాధిత రైతు వాపోయాడు.

## నాగపట్టినం ఎంపీ సెల్వరాజ్ మృతి



చెన్నై: నాగపట్టినం ఎంపీ, కమ్యూనిస్ట్ పార్టీ సీనియర్ నేత ఎం సెల్వరాజ్ (67) అనారోగ్య సమస్యలతో సోమవారం కన్నుమూశారు. ఆయనకు భార్య కమలావతనమ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన 1957లో తిరువరుర్ జిల్లాలో జన్మించారు. ఆయన 1989, 1996, 1998, 2019 లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించారు. డెల్టా రైతులకు మద్దతుగా సెల్వరాజ్ అనేక పోరాటాలు చేశారు. ఆయన మృతిపట్ల ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సీపీఐ రాష్ట్ర శాఖ కార్యదర్శి ఆర్ ముత్తరాసన్ ప్రగాఢ సంతాపం తెలిపారు.

# తడిసిన ధాన్యం కొనే దిక్కులేదు!

మొదటిపేజీ తరువాయి...

తిరిగి బియ్యం ఏ విధంగా ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాక్షాత్తు ముఖ్యమంత్రి మాటకే దిక్కులేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**అకాల వర్షాలు... ప్రభుత్వ నిర్లక్ష్యం**

ఓవైపు అకాల వర్షాలు రైతులపై పగబడితే.. మరోవైపు ప్రభుత్వ నిర్లక్ష్యం వారికి మరింత నష్టం చేస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలు రైతులను నిండా ముంచాయి. చేతికొచ్చిన మిగిలిన పంటతోనైనా పెట్టుబడి వస్తుందనుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి నిరాశే ఎదురవుతున్నది. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం రైతుల కష్టాలను, నష్టాలను మరింత పెంచుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. కొనుగోలు కేంద్రంలోకి ధాన్యం తీసుకొచ్చి వారం పది రోజులవుతున్నా.. కాంట పెట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓసారి ధాన్యం తడిసిందని, మరోసారి ధాన్యం ఎండలేదని, ఇంకోసారి తాలు ఉందని ఇలా ఎప్పటికప్పుడు సాకులు చెబుతూ వాయిదాలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎన్నికలు కూడా రైతుల నష్టాన్ని మరింత పెంచాయి. అధికారులంతా పోలింగ్‌లో నిమగ్నంకావడంతో కొనుగోళ్లు మరింత ఆలస్యం అవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

**రైతులకు రూ. 2వేల కోట్ల బకాయిలు**

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం... రైతులకు డబ్బులు చెల్లింపుల్లోనూ ఇదే తరహా నిర్లక్ష్యం చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు సుమారు 26 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి రైతులకు సుమారు రూ. 5700 కోట్ల వరకు చెల్లించాల్సి ఉండగా రూ. 3700 కోట్ల వరకు చెల్లించినట్టు తెలిసింది. అంటే ఇంకా రైతులకు రూ. 2వేల కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే రైతుబంధు పెట్టుబడి సాయాన్ని ఆలస్యంగా ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ధాన్యం అమ్ముకున్న డబ్బులు కూడా ఆలస్యంగా ఇస్తున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం విక్రయించిన వారం పది రోజులకు కూడా డబ్బులు పడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ ఏజెంట్ దాడి

ఆదిలాబాద్/ఖమ్మం, మే 13 నమస్తే తెలంగాణ : ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం ఆళ్లపాడులో స్వతంత్ర ఏజెంట్‌గా ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ ఏజెంట్ దాడి చేశాడు. బాధిత ఏజెంట్ కథనం ప్రకారం.. బీఆర్ఎస్ కార్యకర్త మరీదు వెంకయ్య ఆళ్లపాడు 133వ బూత్‌లో స్వతంత్ర ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఏజెంట్ నరసింగుల సతీశ్ అదే గ్రామానికి చెందిన ఓ మహిళా ఓటరుతో వెళ్లి ఈవీఎం బటన్ నొక్కాడు. దీనిపై బీఆర్ఎస్ ఏజెంట్‌లు నల్లబోయిన కృష్ణారావు, మరీదు వెంకయ్య అభ్యంతరం తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్త బండి గోపి పలువురు ఓటర్లను పదేపదే పోలింగ్ కేంద్రంలోకి తీసుకొచ్చి కాంగ్రెస్‌కు ఓట్లు వేయించే ప్రయత్నం చేశాడు. దీనిపై బీఆర్ఎస్ చెందిన ఏజెంట్లు పోలింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మరీదు వెంకయ్య ముఖంపై కాంగ్రెస్ ఏజెంట్ నరసింగుల సతీశ్ పిడిగిద్దులు గుద్దాడు. అక్కడున్న ఏజెంట్లు, ఓటర్లు, సముదాయించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**ఆదిలాబాద్ ఎమ్మెల్యేతో గొడవ**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 27వ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ కార్యకర్తలు, కాంగ్రెస్ మహిళలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొన్నది. బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, కొందరు బీజేపీ నేతలు పోలింగ్ స్టేషన్ వద్ద వివాదానికి దారి తీసింది. బీజేపీ నేతలను ఇక్కడి నుంచి పంపించి వేయాలంటూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి భార్య మౌనారెడ్డి మరికొందరు మహిళలు అధికారులను కోరారు. దీంతో బీజేపీ కార్యకర్తలు, కాంగ్రెస్ మహిళలకు తీవ్ర వాగ్వాదం జరిగింది.



సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలో సీఐ శ్రీనుతో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# జనగామ, చేర్యాలలో ఉద్రిక్తత

- **అధికార కాంగ్రెస్ పార్టీకి పోలీసుల వత్తాసు**
- **పోలీసు అధికారుల తీరుపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్**

జనగామ, మే 13 (నమస్తే తెలంగాణ)/జనగామ రూరల్/ చేర్యాల, మే 13 : జనగామ జిల్లా కేంద్రంతోపాటు సిద్దిపేట జిల్లా చేర్యాలలో ఉద్రిక్తతల నడుమ సోమవారం పోలింగ్ జరిగింది. జనగామలో అధికార కాంగ్రెస్ పార్టీకి పోలీసులు వత్తాసు పలకడం, కాంగ్రెస్ యూత్ నాయకుడితోపాటు పదుల సంఖ్యలో అనుచరులను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించడంపై బీఆర్ఎస్ శ్రేణులు అభ్యంతరం చెప్పడంతో ఇరు పార్టీ నేతల నడుమ వాగ్వాదం జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి అనుమతి పత్రం లేకున్నా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి, అతని అనుచరులను పట్టణంలోని ధర్మకంచ పోలింగ్ కేంద్రం గేటు లోపలికి పోలీసులు అనుమతించారు. అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే పోలీసుల తీరును తప్పుపట్టారు. ఇదే విషయమై జనగామ ఏసీపీ అంకిత్, అర్బన్ సీఐ రఘుపతిరెడ్డిని నిలదీశారు. బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనతో పోలింగ్ కేంద్రం ఆవరణలో ఉన్న కాంగ్రెస్ నాయకులను బయటకు పంపించారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు నినాదాలు, ప్రతి నినాదాలతో తోపులాటకు దిగి ఒకదశలో గొడవకు దారితీసింది. ఈ క్రమంలో తనపై రెండు చేతులువేసి నెట్టివేసేందుకు ప్రయత్నించిన ఏసీపీ అంకిత్‌పై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సీరియస్ అయ్యారు. గానుగపహాడ్ గ్రామంలో సైతం ఓటేసేందుకు రోడ్డుపై ఉన్న ప్రజలను అర్బన్ సీఐ అకారణంగా లాఠీచార్జి చేశారని మండిపడ్డారు. పోలింగ్ సందర్భంగా జరిగిన సంఘటనలపై ఎన్నికల సంఘానికి, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. కాగా సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని బాలికల పాఠశాల, పెద్దమ్మగడ్డ పాఠశాల పోలింగ్ కేంద్రాల వద్ద అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పట్టణంలోని బాలికల పాఠశాల పోలింగ్ కేంద్రంలో కొందరు అధికార పార్టీ నాయకులు లోనికి వెళ్లి ప్రచారం చేస్తున్నారని తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు అక్కడికి వెళ్లి అభ్యంతరం తెలిపారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు అక్కడికి వెళ్లారు. అదే సమయంలో కొందరు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే పల్లాతో వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలో ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకునే స్థాయికి చేరుకోవడంతో పలువురు జోక్యం చేసుకుని వారించే ప్రయత్నం చేసినప్పటికీ గొడవ తగ్గుముఖం పట్టలేదు. సుమారు గంట పాటు వాగ్వాదం, తోపులాట జరిగింది.

**• స్ఫూర్తి దాయక ఓటు**




కుమ్రం భీం అసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న దివ్యాంగుడు జకీర్ పాషా

**• తొలిసారి ఓటు**



పెద్దపల్లిలో మొదటిసారి ఓటు వేసిన అనంతరం సిరాచుక్కా చూపుతున్న యువతులు

## చిత్రం





సోమవారం జరిగిన తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో పలువురు సినీ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి తన భార్య సురేఖ, కుమార్తెతో కలిసి జూబ్లీహిల్స్ క్లబ్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అగ్ర దర్శకుడు రాజమౌళి.. భార్య రమా రాజమౌళి, కుమారుడు కార్తికేయతో కలిసి షేక్‌పేటలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. 'దుబాయ్ నుంచి హైదరాబాద్ చేరుకొని నేరుగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశాను' అని రాజమౌళి ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు. వీరితో పాటు అగ్ర హీరోలు మోహన్‌బాబు, మహేష్‌బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్, మంచు విష్ణు, నాగచైతన్య, కల్యాణ్‌రామ్ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతూ ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తారలందరూ సోషల్‌మీడియా వేదికగా సందేశాలను అందించారు.













## దసరా బరిలో 'గేమ్ ఛేంజర్'?



రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా 'గేమ్ ఛేంజర్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. కియారా అద్వాణీ కథానాయిక. ప్రస్తుతం తుదిదశ చిత్రీకరణలో ఉంది. ఈ సినిమాను అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం దసరా కానుకగా అక్టోబర్ 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారని తెలిసింది. అయితే అదే తేదీకి ఎన్టీఆర్ 'దేవర' విడుదల కానుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం 'దేవర' చిత్రాన్ని ఇంకాస్త ముందుగానే రిలీజ్ చేయబోతున్నారని సమాచారం. సెప్టెంబర్ చివరి వారంలో 'దేవర' విడుదల ఉంటుందని చెబుతున్నారు. అయితే ఇవన్నీ కేవలం ఊహాగానాలేనని, మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వస్తేనే రిలీజ్ డేట్స్‌పై స్పష్టత వస్తుందని అంటున్నారు. సమకాలీన రాజకీయాంశాలతో దర్శకుడు శంకర్ 'గేమ్ ఛేంజర్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కియారా అద్వాణీ, అంజలి, సముద్రఖని, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్, సునీల్, నవీన్‌చంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎస్.తిరుణావుక్కరసు, సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, నిర్మాతలు: దిల్‌రాజు–శిరీష్, దర్శకత్వం: శంకర్.

## బాలీవుడ్‌లో బంపరాఫర్



**మలయాళీ భామ కీర్తి సురేష్‌కు** గత ఏడాది బాగా కలిసొచ్చింది. తెలుగులో దసరా, భోళాశంకర్ విజయాలు ఆమె కెరీర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ప్రస్తుతం ఈ భామ తమిళంలో మూడు సినిమాలతో బిజీగా ఉంది. మరోవైపు ఈ ఏడాది 'బేబీ జాన్' చిత్రంతో హిందీ చిత్రసీమలో అరంగేట్రం చేస్తున్నది కీర్తి సురేష్. వరుణ్‌ధావన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం కీర్తి సురేష్ హిందీలో బంపరాఫర్‌ను సొంతం చేసుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అక్షయ్‌కుమార్ హీరోగా ప్రియదర్శన్ దర్శకత్వంలో ఓ సినిమాకు సన్నాహాలు జరుగుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్‌కు బాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంది. యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఇందులో కీర్తి సురేష్‌ను కథానాయికగా ఖరారు చేయబోతున్నారని తెలిసింది. హీరోయిన్ పాత్ర కోసం అలియాభట్, కియారా అద్వాణీ పేర్లను పరిశీలించిన చిత్ర బృందం చివరకు కీర్తి సురేష్‌ను కన్‌ఫర్మ్ చేసిందని తెలుస్తోంది. ఈ సినిమాతో బాలీవుడ్‌లో ఆమె కెరీర్ మరింతగా ఊపందుకుంటుందని అభిమానులు భావిస్తున్నారు.

## ఇక ప్రచారానికి సిద్ధం!



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న సైన్స్ ఫిక్షన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ' నిర్మాణ దశ నుంచే పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. భారతీయ పౌరాణిక ఇతిహాసాల స్ఫూర్తితో ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికాపడుకోన్ వంటి అగ్ర తారలు ఈ సినిమాలో భాగం కావడంతో దేశ వ్యాప్తంగా క్రేజ్ ఏర్పడింది. ఈ చిత్రాన్ని జూన్ 27న విడుదల చేయబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించింది. మహాభారతకాలంలో మొదలయ్యే ఈ కథ దాదాపు ఆరువేల సంవత్సరాల వ్యవధిలో నడుస్తుంది. విడుదల తేది దగ్గరపడుతుండటంతో ఈ సినిమా ప్రమోషన్స్‌ను వినూత్న రీతిలో నిర్వహించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. మైథాలజీ, సైన్స్ అంశాల కలబోతగా పాన్ వరల్డ్ కథాంశం కావడంతో ప్రేక్షకులందరికీ సినిమా రీచ్ అయ్యేలా భారీ స్థాయిలో ప్రచారం చేయబోతున్నారని సమాచారం. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## కేన్స్ వేదికపై 'కన్నప్ప' టీజర్

శ్రీకాళహస్తి స్థలపురాణం ఆధారంగా మంచు విష్ణు రూపొందిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఆయన టైటిల్ రోల్‌ని పోషిస్తున్న ఈ సినిమాలో మోహన్‌లాల్, మోహన్ బాబు, అక్షయ్‌కుమార్, ప్రభాస్ వంటి అగ్ర తారలు భాగమవుతున్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 20న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆవిష్కరించబోతున్నారు. ఈ విషయాన్ని మంచు విష్ణు తన సోషల్‌మీడియా ఖాతాల ద్వారా తెలియజేశారు. 'ప్రపంచ ప్రేక్షకులు మెచ్చేలా మేము ఎంతో ఇష్టంగా తీసిన 'కన్నప్ప' టీజర్‌ను కేన్స్ వంటి ప్రతిష్టాత్మక వేదికపై ఆవిష్కరించబోవడం ఆనందంగా ఉంది. మన భారతీయ చరిత్రను, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషల ప్రేక్షకులకు తెలియజేయడమే మా లక్ష్యం' అని మంచు విష్ణు పేర్కొన్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఈ సినిమా తెరకెక్కుతున్నది.



## తొలి భాగానికే 830 కోట్లు



రణబీర్‌కపూర్ రాముడి పాత్రలో నితీష్ తివారి దర్శకత్వంలో రూపొందిస్తున్న 'రామాయణ' భారతీయ సినీ చరిత్రలో అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్న చిత్రంగా రికార్డు సృష్టించనుంది. మూడు భాగాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ ముంబయిలో మొదలైంది. సీత పాత్రలో సాయిపల్లవి నటిస్తుండగా, రావణాసురుడిగా కన్నడ అగ్ర నటుడు యష్ కనిపించనున్నారు. వివిధ భాషలకు చెందిన అగ్ర నటులు ఈ సినిమాలో భాగం అవుతున్నారు. తాజా సమాచారం ప్రకారం తొలి భాగానికే దాదాపు 830 కోట్లు ఖర్చు పెట్టబోతున్నారని తెలిసింది. గ్లోబల్ ఆడియెన్స్‌ను మెప్పించే లక్ష్యంగా అత్యున్నత సాంకేతిక హంగులతో విజువల్ ఫీస్ట్‌లా ఈ సినిమాకు సన్నాహాలు చేస్తున్నారని, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలకే ఏడాదికిపైగా సమయాన్ని వెచ్చించబోతున్నారని ముంబయి ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. రణబీర్‌కపూర్ 'బ్రహ్మాస్త్ర' చిత్రాన్ని దాదాపు 450 కోట్ల వ్యయంతో తెరకెక్కించారు. ఇప్పటి వరకు ఇండియన్ సినిమాలో అదే హయ్యస్ట్ బడ్జెట్. తాజాగా 'రామాయణ' ఆ రికార్డు బ్రేక్ చేయడానికి సిద్ధమవుతున్నది.